క్లుప్తంగా

హామీలు నెరవేర్చాలంటూ వలంటీర్ల ధర్నా



తాళ్లరేవు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వలంటీర్లు

తాళ్లరేవు: బకాయి వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ వలంటీర్లు సోమవారం ధర్నా నిర్వహించారు. గ్రామ, వార్డు వలంటీర్ల యూనియన్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహసీల్దార్ పితాని త్రినాథరావు, ఎంపీడీఓ కోటిపల్లి సత్యన్నారాయణలకు వినతి పత్రాలు అందజేశారు. వీరి ఆందోళనకు వైఎస్సార్ సీపీ మండల కమిటీ, పలు ప్రజా సంఘాలు మద్దతు ప్రకటించాయి. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు వలంటీర్లను విధుల్లోకి తీసుకొని రూ.10వేల గౌరవ వేతనం ఇవ్వాలన్నారు. ప్రజా సంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, వల్లు రాజబాబు తదితరులు మాట్లాడుతూ గతంలో ప్రజలకు విశేష సేవలందించి ప్రస్తుతం నిరుద్యోగులుగా ఉన్న వలంటీర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చి ఆదుకోవాలని కోరారు.

జిల్లా క్రికెట్ జట్టుకు విద్యార్థి ఎంపిక



కనిష్క్ రాణా చతుర్వేది

అమలాపురం టౌన్: అమలాపురం బాలయోగి స్టేడియంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) అండర్-14 విభాగం ఎంపికల్లో స్థానిక తులిప్స్ పాఠశాల ఆరో తరగతి విద్యార్థి కనిష్క్ రాణా చతుర్వేది ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా టీంకు ఎంపికయ్యాడు. ఈ ఎంపికలకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి దాదాపు 400 మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా టీంలో అమలాపురం నుంచి చతుర్వేది ఒక్కడే ఎంపికయ్యాడు. వచ్చే నెలలో అమలాపురం లేదా అంబాజీపేటలో జరగనున్న రాష్ట్ర స్థాయి అండర్-14 క్రికెట్ పోటీల్లో ఇప్పుడు ఎంపికైన జిల్లా జట్టు పాల్గొననుంది.

ధాన్యం డబ్బులు ఇప్పించండి మహాప్రభో!

అమలాపురం రూరల్: అమలాపురం మండలం వన్నె చింతలపూడికి చెందిన రైతు కందేరి వెంకటేశ్వరరావు రైతు భరోసా కేంద్రంలో మే 6న 20 కింటాళ్ల ధాన్యం అమ్మకం చేశాడు. ఆయనకు ఇప్పటి వరకు డబ్బులు బ్యాంక్ అకౌంట్‌లో జమ కాకపోవడంతో జిల్లా కలెక్టర్‌కు సోమవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సహాయకులను సంప్రదించగా మీ డబ్బులు మీ పేరుతో ఉన్న మరో వ్యక్తి అకౌంట్‌లో పడినట్లు చెప్పారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. పౌర సరఫరాల శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదన్నారు. తనకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను అభ్యర్థించాడు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఐ.పోలవరం: జల్ జీవన్ మిషన్ ద్వారా మండల పరిధిలో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బారాజు శంకుస్థాపన చేశారు. ఐ.పోలవరం గ్రామంలో రూ.46.20 లక్షలు, మురమళ్ల పితానివారి పాలెంలో రూ.98.30 లక్షలతో నిర్మించనున్న మంచినీటి ట్యాంకులకు సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, సాగిరాజు సూరిబాబు రాజు, చెల్లి అశోక్, కాకర్లపూడి రాజేష్, పిన్నమరాజు శివరాజులు పాల్గొన్నారు.

అధికారులను బదిలీ చేయాలి

యానాం: కొన్నేళ్లుగా ఒకే కీలక శాఖలో పని చేస్తున్న ఇద్దరు అధికారులను బదిలీ చేయాలని సోమవారం పుదుచ్చేరి మినిస్ట్రీ ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రటరీ రాజేంద్రన్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. 2013లో సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం కీలక శాఖల్లో పనిచేసే అధికారులు రెండేళ్లకు మించి కొనసాగుతున్నప్పుడు వారిని బదిలీ చేయాల్సి ఉందన్నారు. చీఫ్ సెక్రటేరియట్‌లో సుమారు 20 ఏళ్ల నుంచి డిప్యూటీ సెక్రటరీ(మోనిటరింగ్), పుదుచ్చేరి విద్యాశాఖలో 13 ఏళ్ల నుంచి డిప్యూటీ సెక్రటరీగా మరో అధికారి కొనసాగుతున్నారని అన్నారు. వీరిద్దరినీ బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.

పారిశుధ్య సమస్యపై ఎల్జీకి ఫిర్యాదు

యానాం: యానాంలో పారిశుధ్య పనులు నిలిపివేత తదనంతర పరిస్థితులపై పుదుచ్చేరి ఎల్జీ కె కై లాష్‌నాథన్‌కు ఫిర్యాదు చేసినట్లు సోమవారం పర్యావరణ కోఆర్డినేటర్ దుగ్గుదుర్తి అనితశ్రీ ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత హెచ్ఆర్ స్క్వేర్ సంస్థ అర్ధాంతరంగా పనులు నిలిపి వేయడంతో ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. నిరాటంకంగా పనులు సాగేలా బకాయి జీతాలను సిబ్బందికి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజారోగ్యానికి ఇబ్బంది కలిగేలా కొంతమంది రాజకీయ నేతలు వ్యవహరిస్తున్న తీరును లేఖలో ప్రస్తావించినట్లు తెలిపారు.

నాడు నిర్మించారు.. నేడు వదిలేశారు!

- అందుబాటులోకి రాని సీహెచ్‌సీ మొదటి అంతస్తు భవనం
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణం పూర్తి
- రూ.3.95 కోట్ల నిధులు విడుదల చేసిన మాజీ మంత్రి విశ్వరూప్
- వసతులు లేక రోగుల అవస్థలు



నిర్మాణం పూర్తయినా అందుబాటులోకి రాని ఆస్పత్రి మొదటి అంతస్తు



నిర్మానుష్యంగా నూతన భవనం లోపలి భాగం

అల్లవరం: జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రాలను విస్తరించి తద్వారా నాణ్యమైన ఆరోగ్య సేవలను రోగులకు అందించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రత్యేక చొరవ తీసుకున్నారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రులను విస్తరించి అందుకు తగ్గట్టుగా సౌకర్యాలు కల్పించారు. ఇందులో భాగంగా నిరుపేదలకు వైద్య సేవలు అందిస్తున్న అల్లవరం సామాజిక ఆరోగ్య కేంద్రం విస్తరణకు నిధులు మంజూరు చేశారు. మాజీ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ చొరవతో అల్లవరం సీహెచ్‌సీకి రూ.3.95 కోట్ల నిధులతో ఆస్పత్రి భవనం మొదటి అంతస్తు నిర్మాణం, 108 వాహనం పార్కింగ్ భవనం, శవ పరీక్షలు నిర్వహించే భవనాన్ని నిర్మించారు. గత ప్రభుత్వ హయాంలోనే నిర్మాణాలు పూర్తి చేసుకొని మాజీ మంత్రి విశ్వరూప్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు.

రోగుల అవస్థలు

ప్రారంభోత్సవం చేసి ఏడాది పూర్తయినా నేటికీ మొదటి అంతస్తు అందుబాటులోకి రాలేదు. దీంతో రూ.3.95 కోట్ల నిధులు వెచ్చించి నిర్మించిన ఆస్పత్రి భవనం ఏడాది కాలంగా అలంకార ప్రాయంగా దర్శనమిస్తోంది. ఇటీవల కాలంలో సీహెచ్‌సీలో ఇన్ పేషెంట్, అవుట్ పేషెంట్ ప్రసవాలు, ఆపరేషన్‌ల సంఖ్య గణనీయంగా పెరిగింది. సేవలు మెరుగైనా రోగులు ఉండేందుకు గదులు అందుబాటులో లేవు. జనరల్ మెడిసిన్, సర్జన్, గైనకాలజిస్ట్, మత్తు విభాగం, పిల్లల వైద్యులు, ఫిజియోథెరపీ విభాగాల్లో వైద్య సేవలు అందుతున్నాయి. ఈ సేవలన్నీ కింద అంతస్తులోనే నిర్వహిస్తున్నారు. దీంతో వైద్య సిబ్బంది, రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించడం లేదు అన్న చందాన వైద్యశాఖ అధికారులు ప్రవర్తిస్తున్నారు. నిర్మాణం పూర్తయిన సీహెచ్‌సీ భవనాన్ని వినియోగంలోకి తేవడంలో వైద్య శాఖ నిర్లక్ష్యం వహిస్తుంది. అల్లవరం సీహెచ్‌సీలో రోగులకు తగ్గట్టుగా వైద్య సేవలు అందడం లేదు. రెగ్యులర్‌గా ఉండాల్సిన గైనకాలజిస్టును డిప్యూటేషన్‌పై తరలించడంతో గర్భిణులు, బాలింతలు, గర్భకోశ వ్యాధులతో బాధపడుతున్న రోగులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. ఆస్పత్రిలోని ఎక్స్‌రే, స్కానింగ్ మిషన్లు చెడిపోవడంతో వైద్య సేవలు పూర్తి స్థాయిలో దక్కడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొంత కాలం వేచి చూడాల్సిందే..

> ఆస్పత్రిలో మైనర్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేదు. దీంతో ఆస్పత్రి నుంచి వచ్చే వ్యర్థాలు బయటకు వెళ్లే మార్గం లేకుండా పోయింది. మొదటి అంతస్తు వినియోగంలోకి రావడానికి మరికొంత కాలం పట్టేలా ఉంది. చెడిపోయిన ఎక్స్‌రే, స్కానింగ్ మిషన్ల గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.
>
> సరోజిని, సీహెచ్‌సీ సూపరింటెండెంట్, అల్లవరం.

కలెక్టర్ సారూ.. రహదారిని పట్టించుకోరూ..



కలెక్టర్ మహేష్ కుమార్‌కు రోడ్డు సమస్యను వివరిస్తున్న ఉప్పలగుప్తం నాయకులు

ఉప్పలగుప్తం: అమలాపురం ఎర్రవంతెన నుంచి ఉప్పలగుప్తం మండలం ఎస్.యానం వరకు విస్తరించి ఉన్న ప్రధాన రహదారి అధ్వానంగా ఉందని, పూర్తి స్థాయిలో ఆధునీకరించాలని కిత్తనచెరువు, కూనవరం, గోపవరం, ఎస్.యానం గ్రామాల ప్రజలు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. ఎస్.యానం గ్రామంలో 25 ఏళ్లుగా ఓఎన్‌జీసీ అనుబంధ సంస్థలు తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. వీటికి చెందిన భారీ వాహనాలు ఈ రహదారిపై నుంచే రాకపోకలు చేయడంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సంస్థలు కోట్లాది రూపాయల లాభం పొందుతున్నా ఇక్కడ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టకుండా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) నిధులను వేరే ప్రాంతాల అభివృద్ధికి కేటాయిస్తున్నారన్నారు. కార్యక్రమంలో అమలాపురం నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌చార్జ్ పొలమూరి మోహన్‌బాబు, ఎంపీటీసీల సమాఖ్య మండల అధ్యక్షుడు పెట్టా అప్పారావు, కుంచే బాబులు, దేవరపల్లి నాని, జంగా ప్రసాద్, వస్కా మల్లేశ్వరరావు, పందు అంబేడ్కర్, బూసి వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

తాళ్లరేవు: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్ పుట్టిన రోజు సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో సుమారు వంద మందికి పైగా రక్తదానం చేశారు. తాళ్లరేవు పరదేశమ్మపేటలోని క్రీం కాంపౌండ్ ప్రాంగణంలో ఆయన పుట్టినరోజు వేడుకను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీ మాజీ చైర్మన్ దున్నా జనార్ధనరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కాదా గోవింద కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అభిమానులు హాజరై సాగర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాకినాడ రోటరీ క్లబ్ వైద్యాధికారి పసుపులేటి కామరాజు నేతృత్వంలో జరిగిన రక్తదాన శిబిరంలో 105 మంది రక్తదానం చేశారు. మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు టేకుపూడి నాగేశ్వరరావు, స్థానిక ఎంపీటీసీ సభ్యులు నందికోళ్ల శ్రీదేవి, శ్రీమన్నారాయణ, చిట్టూరి చలపతి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పూడికతీత పనులను సత్వరం పూర్తి చేయండి

- అధికారులకు ఎమ్మెల్యే అశోక్ ఆదేశం
- దరియాలతిప్ప రక్షిత మంచినీటి పథకం పరిశీలన

సాక్షి ఇంపాక్ట్



దరియాలతిప్ప రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: నియోజకవర్గ పరిధిలోని దరియాల తిప్ప రక్షిత మంచినీటి పథకం దుస్థితిపై సోమవారం 'రక్షిత తాగునీటి సరఫరాకు చర్యలేవీ?' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ స్పందించారు. సోమవారం పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ అధికారులతో కలిసి దరియాలతిప్ప రక్షిత మంచినీటి పథకాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పూడికలేక పిచ్చిమొక్కలు, గడ్డితో నిండిపోయిన రక్షిత మంచినీటి చెరువును పరిశీలించారు. అనంతరం అయన అధికారులతో మాట్లాడారు. పూడిక తీయక పోవడం వల్లే తాగునీరు దుర్వాసన వస్తోందని చెరువులో పూడికతీత పనులు రెండు రోజుల్లో ప్రారంభించాలని ఆదేశించారు. స్థానికులు సైతం తమకు వస్తున్న పచ్చ రంగు తాగు నీటిని ఎమ్మెల్యే చూపించారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, పీడబ్ల్యూడీ ఇంజినీర్లు కాళ్ల నాగరాజు, జ్యోతిరాజు, గ్రామ పెద్దలు సబ్బంతి శ్రీనివాస్, బాలయోగి, గిడ్ల వెంకన్న, రైతులు తిరుకోటి బైరవస్వామి, కోరుకొండ ఆనందరావు, సబ్బతి రాంబాబు పాల్గొన్నారు.

తీరు మారకుంటే ప్రజా పోరాటాలకు సిద్ధం

అధికారులను హెచ్చరించిన ఎమ్మెల్యే అశోక్



ఆర్ఏఓ చాంబర్‌లో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో కొన్నేళ్లుగా పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న హెచ్ఆర్ స్క్వేర్ సిబ్బందికి 8 నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు పడుతుంటే కనీసం అధికారులు పట్టించుకోవడం లేదని తనపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చేలా పారిశుధ్య నిర్వహణను గాలి కొదిలేశారని ఆర్ఏఓ మునిస్వామిపై ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన ఆర్ఏఓ చాంబర్‌లో మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో హెచ్ఆర్ స్క్వేర్ సిబ్బంది పారిశుధ్య పనులు నిలిపి వేయడంతో ఎక్కడి కక్కడ వీధుల్లో భారీగా చెత్త, వ్యర్థాలు పేరుకుపోయి జన జీవనానికి ప్రతిబంధకంగా మారిందన్నారు. పుదుచ్చేరి, కారైకల్‌లలో సైతం హెచ్ఆర్ స్క్వేర్ సంస్థ పని చేస్తుందని అక్కడ ఎటువంటి రాజకీయ పరమైన ఒత్తిడి లేకుండా పనులు జరుగుతున్నాయన్నారు. యానాంలో మాత్రం కొంత మంది అధికారులు రాజకీయ నేతల చెప్పుచేతల్లో ఉంటూ ప్రజాభివృద్ధి పనులకు విఘాతం కలిగిస్తున్నారని ఆరోపించారు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజా పోరాటంకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు.

ఉద్యోగం తొలగింపుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

అమలాపురం రూరల్: అమలాపురం మండలం గున్నేపల్లి అగ్రహారం గ్రామ పంచాయతీలో తాను ఏడేళ్లుగా గుమస్తాగా పని చేస్తున్నానని తనను గ్రామ సర్పంచ్ ఉదోగ్యం నుండి తొలగించారని నాగాబత్తుల ప్రమీల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తన తండ్రి మృతి చెందితే 2016లో ఆ ఉద్యోగం తనకు ఇచ్చారని ఉద్యోగం నుంచి తొలగించ వద్దంటూ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందించారు. నిరుపేద కుటుంబానికి చెందిన తనకు అధికారులు న్యాయం చేయాలని కోరారు. తనకు రావాల్సిన జీతం బకాయిలు సైతం చెల్లించలేదన్నారు.

భక్తి శ్రద్ధలతో కార్తిక సోమవారం పూజలు



తాళ్లరేవులో భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి



పాతకోరంగి కురంగేశ్వర స్వామి



కుండలేశ్వరం పుష్కర ఘాట్ వద్ద పూజలు చేస్తున్న మహిళలు

తాళ్లరేవు: పవిత్ర కార్తిక సోమవారం పూజలను భక్తులు భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. కార్తిక మాసం తొలి సోమవారం కావడంతో మండలంలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారు జామునే పవిత్ర నదీ స్నానాలాచరించి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన తాళ్లరేవులోని పురాతన శివాలయంలో అర్చకులు కొండవీటి శివరామకృష్ణ ఆధ్వర్యంలో శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. చొల్లంగి రాజరాజేశ్వరీ సహిత సోమేశ్వర స్వామి, పటవల, పిల్లంక గ్రామాల్లోని శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరీ సహిత విశ్వేశ్వర స్వామి, పాతకోరంగి కురంగేశ్వర స్వామి, నీలపల్లి నీలకంఠేశ్వర స్వామి, ఇంజరం ఉమా కృపేశ్వర స్వామి, ఉప్పంగల రామలింగేశ్వర స్వామి ఆలయాలలో స్వామి వారికి విశేష పూజలు చేశారు. చరిత్ర ప్రసిద్ధి గాంచిన కాపులపాలెం శ్రీ భద్రకాళీ సహిత వీరేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. వీరేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు, చందనం తదితర ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు.

మార్మోగిన శివనామం

అల్లవరం: పవిత్ర కార్తిక మాసం పురస్కరించుకొని తొలి సోమవారం మండలంలోని పలు శివాలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. తెల్లవారు జాము నుంచి భక్తులు శివాలయాల వద్ద పార్వతీ పరమేశ్వరుల దర్శనానికి బారులు తీశారు. ఆలయ ముఖ మండపాల వద్ద కార్తిక దీపాలు వెలిగించి ఆది దేవుడ్ని దర్శించుకున్నారు. దేవగుప్తంలోని ఉమా సమేత మల్లేశ్వర స్వామి, అల్లవరంలోని చంద్రమౌళీశ్వర స్వామి, ఎస్.రామేశ్వరంలో కొలువైన పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి, లక్ష్మణేశ్వరంలో కొలువైన పార్వతీ సమేత లక్ష్మణేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు పోటెత్తారు. భక్తులకు ఏలాంటి ఆసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కుండలేశ్వరుని దర్శనానికి పోటెత్తిన భక్తజనం

కాట్రేనికోన: కార్తిక మాసం మొదటి సోమవారం పార్వతీ సమేత కుండలేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. తెల్లవారు జామునే గౌతమీ గోదావరి కుండలేశ్వరం రేవులో స్నానాలు ఆచరించి దీపారాధన చేశారు. అనంతరం స్వామిని దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద సామూహిక అన్న ప్రసాద వితరణను దాతలు ఏర్పాటు చేశారు.

శివనామంతో హోరెత్తిన వీరేశ్వరుని సన్నిధి

ఐ.పోలవరం: మురమళ్ల శ్రీ వీరేశ్వర స్వామి ఆలయం కార్తికమాసం మొదటి సోమవారం సందర్భంగా శివనామ స్మరణతో మార్మోగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. ఆలయం చెంతనే ఉన్న పవిత్ర వృద్ధ గౌతమీ నదిలో స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు బ్రహ్మశ్రీ యనమండ్ర సుబ్బారావు ఆధ్వర్యంలో పూజలు, దర్శనాలు జరిగాయి. పంచామృతాభిషేకాలు, లఘున్యాస అభిషేకాలు ఆలయ పురోహితులు బ్రహ్మశ్రీ నాగాభట్ల రామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో పురోహితులు నిర్వహించారు. సుమారు 10 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకొన్నట్లు దేవస్థానం అధికారులు చెప్పారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా క్యూ లైన్లు ఏర్పాట్లు చేశారు. ఐ.పోలవరం ఎస్సై మల్లికార్జునరెడ్డి బందోబస్తు నిర్వహించారు. భక్తుల కోసం మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. భక్తులకు సత్యసాయి సేవాదళ్ సభ్యులు విశేష సేవలందించారు. భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

అమలాపురం టౌన్: పవిత్ర కార్తిక మాసం తొలి సోమవారం పట్టణంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జాము నుంచే భక్తులు శివాలయాలకు చేరుకున్నారు. మహిళలు సంధ్య వేళ శివాలయాల ప్రాంగణంలోని ధ్వజ స్తంభాల వద్ద కార్తిక దీపాలు వెలిగించడంతో ఆలయాలు దేదీప్యమానంగా ప్రకాశించాయి. పట్టణంలోని పురాతన శివక్షేత్రమైన చెన్న మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద శివుని దర్శనం కోసం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు బారులు తీరారు. చంద్రమౌళీశ్వర స్వామి, సిద్ధేశ్వరస్వామి, రామలింగేశ్వర స్వామి, నాగ లింగేశ్వర స్వామి ఆలయాల్లో కార్తిక పూజలు వైభవంగా జరిగాయి.



దేవగుప్తంలో ఉమా సమేత మల్లేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న పురోహితుడు



వీరేశ్వరస్వామికి పంచామృతాభిషేకం



అమలాపురంలోని పురాతన శివక్షేత్రం చెన్న మల్లేశ్వర స్వామి ఆలయంలో బారులు తీరిన భక్తులు

నడకపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి



నూతనంగా ఎన్నికైన క్లబ్ సభ్యులకు సన్మానం

అమలాపురం టౌన్: గ్రామీణ ప్రాంతాల్లో వాకర్స్ క్లబ్‌లు మరిన్ని ఏర్పడి ప్రజల్లో నడకపై చైతన్యం తీసుకురావాలని అంతర్జాతీయ వాకర్స్ కోఆర్డినేటర్ తేతల సత్యనారాయణ రెడ్డి అన్నారు. స్థానిక డాబాగార్డెన్స్‌లో అమలాపురం రూరల్ మండలం నడిపూడికి నూతనంగా ఏర్పాటైన వాకర్స్ అండ్ లాఫింగ్ హెల్త్ క్లబ్‌ను ఆయన సోమవారం ప్రారంభించి ప్రసంగించారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ ఎన్నికయ్యారు. క్లబ్ సలహాదారులుగా వాకర్స్ బులిటన్ ఎడిటర్, నడక కవి నల్లా నరసింహమూర్తి, బుర్ర కథ కళాకారుడు కడలి సత్యనారాయణలను ఎన్నుకున్నారు. డాబా గార్డెన్స్‌లోని ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో నూతన క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ, సలహాదారులు నరసింహమూర్తి, సత్యనారాయణలను వాకర్స్ కో ఆర్డినేటర్ సత్యనారాయణరెడ్డి ఘనంగా సత్కరించి అభినందించారు. వాకర్స్ ప్రతినిధులు సాపే బాల రవి, దేవాదుల సూర్యనారాయణ మూర్తి, గున్నేపల్లి భీమశంకరం పాల్గొన్నారు.

మద్యం దుకాణం తొలగించాలంటూ ఆందోళన



మద్యం దుకాణాన్ని తొలగించాలని ధర్నా చేస్తున్న కార్మికులు

అమలాపురం రూరల్: అమలాపురం మండలం కామనగరువు బైపాస్ రోడ్‌లో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగిచాలని ఆమని ఆటో ఏజెన్సీస్ కార్మికులు సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కామనగరువు బైపాస్ రోడ్‌ను ఆనుకుని ఏర్పాటు చేసిన మద్యం దుకాణం వల్ల ఆమని ఆటో ఏజెన్సీలో పని చేస్తున్న కార్మికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మద్యం షాపు పక్కనే ఆలయం ఉన్నందున భక్తులకు అసౌకర్యం కలగడమే కాక ఈ దారిన వెళ్లే స్కూల్ విద్యార్థులు, గ్రామస్తులకు తీవ్ర అసౌకర్యంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశామని తక్షణమే దుకాణాన్ని తొలగించాలని జేసీ నిషాంతి అధికారులు ఆదేశాలు ఇచ్చారన్నారు. అయినప్పటికీ దుకాణాన్ని తరలించలేదని గ్రీవెన్స్‌లో మరోమారు ఫిర్యాదు చేశామన్నారు.

పారిశుధ్య కార్మికులతో చర్చలు సఫలం

యానాం: నియోజకవర్గ పరిధిలో పారిశుధ్య పనులు నిర్వహించే హెచ్‌ఆ ర్‌స్క్వేర్ కార్మికులతో సోమవారం రాత్రి వరకు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ చర్చలు నిర్వహించారు. పది రోజుల్లో 8 నెలల బకాయి వేతనాలు పూర్తి స్థాయిలో అందించేలా చర్యలు తీసుకుంటానని ప్రజారోగ్య పరిరక్షణ దృష్ట్యా విధులకు హాజరు కావాలని కార్మికులను కోరారు. మంగళ, బుధ వారాల్లో ముందస్తుగా ఒక నెల జీతం చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. ఈ మేరకు మంగళవారం నుంచి విధులకు హాజరవుతున్నట్లు కార్మికులు ప్రకటించారు.

పాఠశాలకు మౌలిక వసతులు కల్పించండి



ఆర్డీవో మాధవికి వినతి పత్రం అందిస్తున్న ఎస్ఎంసీ సభ్యుడు శ్రీనివాస్

అమలాపురం టౌన్: అల్లవరం మండలం గోడి బాలికల గురుకుల పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ అమలాపురం ఆర్డీవో కె.మాధవికి ఆ పాఠశాల ఎస్ఎంసీ సభ్యుడు జంగా శ్రీనివాస్ సోమవారం వినతి పత్రం అందించారు. పాఠశాలలో విద్యార్థులు మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్న తీరును ఆర్డీఓకు వివరించారు. పాఠశాలకు తక్షణం మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

రాజీవ్ గాంధీ విగ్రహాన్ని పునర్నిర్మించాలి

అమలాపురం రూరల్: మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ విగ్రహాన్ని పునర్నిర్మించకుంటే నిరాహార దీక్షకు సిద్ధమని కోనసీమ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినితిపత్రం అందించారు. కలెక్టర్‌ను కలిసిన చిట్టిబాబు మాట్లాడుతూ పుల్లేటికురు సెంటర్లో రాజీవ్ గాంధీ విగ్రహం తొలగించారని ఆర్డీవోను కలిసి ఫిర్యాదు చేసినా ఏ విధమైన చర్యలు తీసుకోలేదన్నారు. రాజీవ్ గాంధీ విగ్రహాన్ని యధా స్థానంలో పునర్నిర్మాణం చేయాలని లేకుంటే నిరాహార దీక్షలకు దిగుతామని కలెక్టర్‌కు తెలిపినట్లు చెప్పారు. మామిడికుదురు మండలంలో సాంఘిక సంక్షేమ బాలుర, బాలికల హాస్టళ్లలో వార్డెన్‌లను నియమించాలని కోరినట్లు చెప్పారు.